
# పేదవాని పెన్నిధి

— కాకాని కమల

కథ



**ఉదయం పదిగంటలకల్లా ఆఫీసుకు వచ్చి నా ఛాంబర్‌లో కూర్చున్నాను.**
**ఇవ్వాళ కొన్ని 'ఇంటర్వ్యూలు' ఉన్నాయ్.**
**మా కంపెనీలో ఒక బ్రాంచి మేనేజర్ పోస్టు ఖాళీ ఉంది.**
**అర్హతని బట్టి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్**

రెండు నెలల క్రితం 'రిటన్ టెస్ట్' కండక్ట్ చేశాం.

అందులో పాసయిన వాళ్ళని 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'లో కొందర్ని మాత్రమే ఇంటర్వ్యూకి పిలిచాం.

నేను ఈ కంపెనీలో ఒక వి.ఐ.పి ఎగ్జిక్యూటివ్‌గా 'కీ' పోస్టులో ఉన్నాను. ఇక్కడ నా సర్వీస్ ఇరవై ఏళ్ళు.

మామూలుగా అయితే మా కంపెనీ బోర్డ్ మెంబర్స్‌తో కలిసి ఈ ఇంటర్వ్యూస్ తీసుకోవాలి.

కాని వాళ్ళు ప్రస్తుతం ఫారిన్ టూర్‌లో ఉండటం చేత ఈసారి ఇంటర్వ్యూస్ నేను ఒక్కడ్నే తీసుకోవాల్సి వచ్చింది.

నా పై అధికారులకి నా మీద ఉన్న నమ్మకం చేత ఈ బాధ్యత నాపై పెట్టారు. ఉన్నది ఒకే పోస్టు. బ్రాంచి మేనేజర్‌గా ఎవరు సెలక్ట్ అయినా అదృష్టవంతులే. ఐదువేలు స్టార్టింగ్ జీతం. ఇంకా కంపెనీ తరఫున అదనపు సౌకర్యాలు.

ఇంతకు ముందు కూడా ఇలాగే ఒకసారి స్టాఫ్‌కి ఇంటర్వ్యూస్ నేను ఒక్కడ్నే తీసుకున్నాను.

నాకు చాలా ఆనందంగా ఉంది.

గర్వంగా కూడా ఉంది.

సాయంత్రం నాలుగింటి దాకా ఇంటర్వ్యూస్ సాగాయి.

మధ్యలో రెండు గంటలు లంచ్.

నాలుగవుతుంటే క్యాండిడేట్లు అందరూ అయిపోయారు.

అందరూ వెళ్ళిపోయాక కాలింగ్ బెల్ కొట్టి ప్యూన్ని పిలిచి ఒక గంట దాకా విజిటర్స్ ఎవరు వచ్చినా నా ఛాంబర్‌లోకి పంపించవద్దని చెప్పి రిలాక్స్‌డ్‌గా ఒక్కడ్నీ కుర్చీలో కూర్చున్నాను.

ఇంటర్వ్యూ కేండిడేట్లందరిలోకి అన్నివిధాల ధీటైన వ్యక్తిగా ఒక అభ్యర్థి నిలబడ్డాడు.

అతని పేరు వెంకటరమణ. ఎం.కాం, గోల్డ్‌మెడలిస్ట్.

ఎం.బి.ఏ డిస్టింగ్‌షన్. పర్సనల్ మేనేజ్‌మెంట్ కూడా చేశాడు. ప్రస్తుతం డిప్లొమా ఇన్ కంప్యూటర్స్ చేస్తూ పార్ట్‌టైమ్‌గా ఏదో కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడుట!

అతని అర్హతకి తగ్గ ఉద్యోగం ఏదీ ఇంతవరకు దొరకలేదట.

నిజమే...

అర్హతనిబట్టి అవకాశాలు వచ్చే రోజులు వెళ్ళిపొయ్యాయి కదా మరి?

ప్రభుత్వం నిర్వహించే కాంపిటీటివ్ ఎగ్జామ్స్ చాలానే పాసయ్యాడుట.

కాని ఇంటర్వ్యూలో పోతున్నాయని చెప్పాడు.

అతనికి తండ్రి లేడు. ముగ్గురు చెల్లెళ్ళు, తమ్ముడు, తల్లి ఉన్నారు. వ్యవసాయ కుటుంబం. ఆడపిల్లల పెళ్ళి నిమిత్తం ఉన్న పొలం అమ్ముకొన్నారుట.

ఉత్తరం దక్షిణం సమర్పించుకోలేని స్థితి.

ఇవ్వాళ నా ఇంటర్వ్యూ కూడా బాగా చేశాడు.

జి.కె ఏది అడిగినా ఫట్‌ఫట్‌మని కంప్యూటర్‌లా జవాబులు చెప్పాడు. అస్సలు తడుముకోలేదు.

పర్సనాలిటీ కూడా చక్కగా ప్లీజింగ్‌గా ఉంది. బ్రాంచి మేనేజర్ అన్న పదానికి రిప్రజెంటేటివ్‌లా అనిపించాడు.

ఇలాంటి వాళ్ళు కంపెనీలో వుంటే తప్పకుండా కంపెనీ అభివృద్ధి సాధిస్తుంది.

ఎటువంటి పార్టీ వచ్చినా తన తెలివితేటల్తో మెప్పించి బిజినెస్ ఒప్పించగలడు అనిపించింది నాకు. అతన్ని అరగంటపైగా ఇంటర్వ్యూ చేశాక-

నిజాయితీగా అర్హతనిబట్టి చూస్తే వెంకటరమణనే కంపెనీ బ్రాంచి మేనేజర్‌గా ఉద్యోగానికి సెలక్టు చెయ్యాలి నేను.

ఇంకొక పరిస్థితిలో అయితే చేసేవాడ్నేమో కూడా.

కాని ఇక్కడొక మెలిక వచ్చింది.

ఇంటర్వ్యూస్ నేను ఒక్కడ్నే చేస్తున్నానని తెల్సి మా బావమరిది పంపగా ఒక వ్యక్తి వచ్చి నన్ను కలిశాడు.

ఆయన కొడుకు కూడా ఈ ఇంటర్వ్యూకి వస్తున్నాడుట. అభ్యర్థి పేరు అజయ్‌బాబు. అతను కూడా ఎం.కాం. కాని గోల్డ్‌మెడల్ లేదు. ఎం.బి.ఏ ప్రైవేటుగా చేశాడు. ఇంకా మిగతా క్వాలిఫికేషన్స్ అంటే వెంకటరమణ కున్న పి.ఎం కోర్సు, డిసిఏ లేదు. జి.కెలో కూడా అడిగిన వాటికి సరిగా జవాబులు చెప్పలేకపోయాడు. సరిగా జవాబులు చెప్పినవి చాలా తక్కువ. ఒకటీ రెండు ఆలోచించి తడుముకొని కరెక్టుగా చెప్పాడు.

వీటన్నింటిని మించిన డ్రాబ్యాక్ అతని పర్సనాలిటీ. పొట్టిగా, లావుగా ఉన్నాడు.

వెంకటరమణ బాగా చెయ్యెత్తున, ధీమాగా ఉన్నాడు. అతనికి కళ్ళజోడు కూడా సూటయి లేని హుందాతనాన్ని తెచ్చింది. కొన్ని ఎగ్జిక్యూటివ్ పోస్టులకి పర్సనాలిటీ కూడా ముఖ్యమే. బ్రాంచి మేనేజర్‌గా అతన్ని సీట్లో కూర్చోబెడితే వెంకటరమణ ప్లస్ పాయింట్ అవుతాడు.

అజయ్‌బాబు నిస్సందేహంగా మైనస్ పాయింట్ అవుతాడు.

కాని అజయ్‌బాబు తండ్రి భానుమూర్తి నన్ను చాలా మొహమాటంలో పెట్టాడు.

ఆ ఉద్యోగం ఆయన కొడుక్కి వేయిస్తే - అంటే ఇంటర్వ్యూలో నేను అజయ్‌ని సెలక్టు చేస్తే - నాకు యాభై వేలు ఇస్తానని మా బావమరిది చేత చెప్పించాడు.

అడ్వాన్సుగా నాకు పాతికవేలు కూడా ముట్టాయి.

ఉద్యోగం అప్పాయింట్‌మెంట్ కాగానే మిగతా పాతికవేలు అందుతాయి. మా ఆవిడ రికమండేషన్ కూడా తోడయ్యింది. ఎందుకంటే ఆవిడ తమ్ముడి దగ్గర్నుంచి వచ్చిన క్యాండిడేటు.

నాకు ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు.

ఒకడు మెడిసన్ మూడో సంవత్సరం. ఇంకొకడు ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నారు. ఆడపిల్లలిద్దరికి పెళ్ళిళ్ళు అయ్యాయి. మూడవ అమ్మాయి డిగ్రీ అయ్యింది. ప్రస్తుతం దానికి పెళ్ళిచేసే ప్రయత్నంలో ఉన్నాను. డబ్బుకి చాలా కటకటగా ఉంది. కాని పెళ్ళి చెయ్యటం తప్పదు కదా? ఏవో మంచి సంబంధాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఈ పరిస్థితిలో నాకీ అవకాశం వచ్చింది.

డబ్బు తీసుకుని పనిచెయ్యమని మా ఆవిడ నన్ను ప్రలోభపెట్టింది.

బావమరిది కూడా స్వయంగా వచ్చి చెప్పి వెళ్ళాడు.

'బావా! ఇది కేవలం నీ అవసరమే కాదు. నా ప్రిస్టేజికి సంబంధించినది కూడా' అని హెచ్చరించి వెళ్ళాడు.

ఇంక మా ఆవిడ వత్తాసు ఉండనే ఉంది.

ప్రస్తుత పరిస్థితిలో నా అవసరాల దృష్ట్యా వేరే దారి లేదు

అందుకే నేను ఆశపడి అజయ్‌ని ఆ పోస్టుకి సెలక్టు చేస్తానని చెప్పి పాతికవేలు తీసుకున్నాను.

'అమ్మాయికి బంగారం ఇప్పుడే కొందామండి. మళ్ళీ పెళ్ళిళ్ళ సీజన్‌లో అయితే ధర ఎక్కువగా ఉంటుంది' అంది మా ఆవిడ.

'ఉండు. ఇంటర్వ్యూలు అవనీ. ఆ కుర్రాడు జాయిన్ అయ్యాక చూద్దాం' అని ఆ డబ్బు నా దగ్గరే బీరువాలో సేఫ్‌లాకర్‌లో భద్రం చేశాను.

ఇంటర్వ్యూస్ ముందు బ్యాంక్‌లో వేయాలంటే భయం అనిపించింది. ఈ వెంకటరమణ లేకపోతే అజయ్‌బాబుని నిక్షేపంగా సెలక్టు చెయ్యొచ్చు. కాని వెంకటరమణ అన్నివిధాల మెరిట్‌గా నిలబడుతున్నాడు. నా మనసు పీకుతోంది.

రమణకి పాపం తండ్రి లేడు. ఆర్థిక ఇబ్బందులు, బాధ్యతలు ఉన్నాయ్. రికమండేషన్ చేయించుకునే పలుకుబడి లేదు. దక్షిణ సమర్పించుకునే ఆర్థిక స్తోమత లేదు. సిన్సియర్‌గా క్వాలిఫికేషన్ పెంచుకొని ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాడు.

పోనీ... అతన్నే సెలక్టు చేద్దామా అనిపిస్తోంది.

కాని చేతిలో పడ్డ పాతికవేలు - రాబోయే ఇంకో పాతికవేలు - మా అమ్మాయి పెళ్ళి - అన్నింటిని మించి మా బావమరిది, మా ఆవిడ ముందూ నా ప్రిస్టేజి...

నన్ను ప్రలోభపెడుతున్నాయి.

రేపు ఈ ఇంటర్వ్యూ రిజల్టు డిక్టేట్ చేసి కొరియర్‌లో బొంబేలోని మా హెడ్డాఫీసుకి పంపితే రెండు రోజుల్లో కొరియర్ అప్రూవల్ తీసుకుని వస్తాడు.

అప్పుడు 'ఆర్డర్ ఇష్యూ' చేయాలి.

వారంరోజుల్లో అపాయింట్‌మెంట్ అయిపోతుంది.

ఈ రాత్రికే నా నిర్ణయం తీసుకోవాలి.

చాలా ఆలోచించి అజయ్‌బాబుని సెలక్టు చెయ్యటానికి నిర్ణయించుకున్నాను.

వెంకటరమణ గురించి మనసు జాలిపడింది.

సాయంత్రం ఐదు దాటుతోంది.

కాల్‌బెల్ కొట్టి ప్యూన్ రాగానే ఫైల్స్ కారులో పెట్టమని చెప్పి కుర్చీలోంచి లేచాను.

★ ★ ★

కారు టాంక్‌బండ్ మీంచి పోతుంటే హుసేన్‌సాగర్ మీంచి వచ్చే చల్లగాలి వస్తోంది.

ఈ మధ్యపడ్డ భారీ వర్షాలవల్ల కాబోలు హుసేన్‌సాగర్‌లో నీళ్ళు కూడా బాగా ఉన్నాయి.

మెత్తగా సాగిపోతున్న కారు సడన్ బ్రేక్ పడటంతో చప్పున తలతిప్పి బయటికి చూశాను.

చాలామంది జనం రెయిలింగ్ పట్టుకొని నీళ్ళలోకి తొంగి చూస్తున్నారు.

దూరంగా అటుఇటు రోడ్డు మీద జనాలు కూడా పరిగెత్తినట్టు - కార్లు తదితర వాహనాలు ఆపుకొని ఆ గుంపులో చేరుతున్నారు.

'ఏమైంది డ్రైవర్?'

'ఏమో సార్'

'చూసి రా' అన్నాను.

కిందికి దిగి ఆ గుంపులోకి వెళ్ళి వచ్చాడు.

'ఎవరో నీళ్ళలోకి దూకాడట సార్. దారిన పోతున్న ఇద్దరు కానిస్టేబుళ్ళు చూసి వాళ్ళు దూకి అతన్ని బయటికి తీశారు. చచ్చిపొయ్యాడంటున్నారు' అన్నాడు.

'అర్రెరె... ఎవరతను?' అంటూ నేను కారు దిగి ఆ గుంపులోకి వెళ్ళాను.

నీళ్ళలోపడ్డ వ్యక్తిని ఫుట్‌పాత్ మీద పడుకోబెట్టారు. నీళ్ళు బాగా తాగినట్టున్నాడు. ముఖం, పొట్ట బాగా ఉబ్బిపొయ్యాయి. కావాలనే దూకాడుట. పార్కులో ఆడుకుంటున్న పిల్లలు చెప్తున్నారు.

ఆ వ్యక్తి చొక్కా జేబుకి గుండి పెట్టి ఉంది. ఆ గుండి తీసి జేబులోంచి కనిపిస్తున్న ఓ కవరుని బయటికి తీశాడు కానిస్టేబుల్.

అది ఒక పాలిథిన్ కవర్. నాలుగు మడతలు పెట్టి రబ్బర్ బాండ్ బిగించాడు.

దానిలో ఒక చిన్న ఉత్తరం ఉంది.

బహుశా ఆ కాగితం తడవకుండా ముందు జాగ్రత్తగా పాలిథిన్ కవర్‌లో పెట్టి ఉంటాడు.

అంటే ఇది నిస్సందేహంగా ఆత్మహత్యే.

కానిస్టేబుల్ ఆ ఉత్తరం బయటికి తీశాడు.

'గౌ. ఎస్.ఐగారికి,

నా మరణానికి నేనే బాధ్యుడ్ని. ఇందులో ఎవరి ప్రమేయం లేదు. నేను ఒక పోస్టుగ్రాడ్యుయేట్‌ని. చాలారోజులుగా మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించి ఓడిపోయాను. ఏవో చిన్న చితక ఉద్యోగాలు చేసిన నాకెందుకో జీవితం సంతోషాన్ని ఇవ్వలేదు. నాపై ఆధారపడ్డ నా తల్లిదండ్రీ కుటుంబ బాధ్యతలు, ఆర్థిక సమస్యలు, నిరుద్యోగం, నిరాశ నన్ను నిరాశావాదిగా మార్చాయి. నాకు జీవితం మీద విరక్తి పుట్టింది. అందుకే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. క్రింద నా అడ్రస్ ఉంది. నా మరణం గురించి నా తల్లిదండ్రులకి తెలపండి.

పి.ఎస్: నా తల్లిదండ్రులు చాలా పేదవారు. నన్ను దహనం చేసే శక్తి కూడా వాళ్ళకి లేదు. అందుకే దయ వుంచి మున్సిపాలిటీ వారు ఆ బాధ్యత తీసుకోవలసిందిగా అర్థిస్తున్నాను. నా శరీరంలోని నా కళ్ళు, తదితర ఏ అవయవాలు అయినా సరే ఇతరులకి అమర్చటానికి పనికి వస్తే తీసుకోండి. నేను డొనేట్ చేస్తున్నాను. నా ఇష్టపూర్వకంగా ఈ ఉత్తరం రాస్తున్నాను.

ఇట్లు
సత్యన్నారాయణ

కానిస్టేబుల్ చదివిన ఉత్తరం నాలో కలకలం రేపింది.

కళ్ళు చెమ్మగిల్లుతుంటే గబగబా వచ్చి కారులో కూర్చున్నాను.

కారుతోపాటు నా ఆలోచన్లు సాగిపోతున్నాయి.

మళ్ళీ నా కళ్ళ ముందు ఆనాటి ఇంటర్వ్యూ విషయాలు కదిలాయి.

అందిన పాతికతోపాటు రాబోయే పాతికవేలు కూడా నా కళ్ళ ముందు కదిలాయి.

'నేను చేస్తున్న ఇరవై నాల్గవ ఇంటర్వ్యూ సర్ ఇది. ఇంకొక ఆరునెలల్లో నా ఉద్యోగ వయోపరిమితి కూడా దాటిపోతుంది' వెంకటరమణ అభ్యర్థన నా గుండెలో మారుమ్రోగింది.

నేను వెంకటరమణకి ఆ ఉద్యోగం ఇవ్వకపోతే వెంకటరమణ కూడా ఈ సత్యన్నారాయణలాగే హుస్సేన్‌సాగర్‌లోకి దూకి ఆత్మ....

... ... ... ...

ఉఫ్... కళ్ళు మూసుకున్నాను.

వద్దు.

ఒకవేళ అదే జరిగితే ఆ పాపం తనని చుట్టుకుంటుంది.

అక్షరాలా అలాగే జరగకపోయినా నిరాశతో ఆ వెంకటరమణ మనసు క్షోభిస్తే అది మాత్రం తనకి క్షేమమా?

ఆ ఉసురు కొట్టదూ?

ఇంటికి వస్తూనే నా గదిలోకి వెళ్ళి కార్డ్‌లెస్ ఫోన్ తీసి అజయ్‌బాబు తండ్రి భానుమూర్తికి ఫోన్ చేశాను.

'అనివార్య పరిస్థితిలో అజయ్‌ని సెలక్ట్ చేయలేకపోయానని పై అధికారులు ఇన్‌వాల్వ్‌మెంట్ వల్ల వెంకటరమణ అనే క్యాండిడేట్‌ని సెలక్ట్ చేశామని, వెంటనే వచ్చి పాతికవేలు తీసుకెళ్ళమని చెప్పి ఫోన్ పెట్టేశాను'

ఇప్పుడు నా మనసు ప్రశాంతంగా ఉంది.

మా అమ్మాయి పెళ్ళి ఇప్పుడు నన్ను భయపెట్టడం లేదు.

'ఇద్దరు ఆడపిల్లల పెళ్ళి చేసిన నేను ఇంకొక ఆడపిల్ల పెళ్ళి చెయ్యలేనా?' అనుకున్నాను ధీమాగా.

★